ఆది వారం
03-12-2023
సంపుటి - 08,
సంచిక - 402
పేజీలు - 4
వెల రూ. 5/-
Telangana
Andhra Pradesh
CEO & Editor : G. PRUDHVIRAJ
RNI NO: TELTEL/2016/73311
www.samasamajam.in
సమ సమాజం
SAMA SAMAJAM TELUGU DAILY
తెలుగు వార్త పత్రిక
Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole

# నేడే ఓట్ల లెక్కింపు

## కౌంటింగ్ కేంద్రాల వద్ద భారీ భద్రత



8గంటలకు కౌంటింగ్ ప్రారంభం● 10కల్లా తొలి ఫలితం వెలువడే ఛాన్స్● భారీగా భద్రాతా ఏర్పాట్లు చేసిన ఇసి

**హైదరాబాద్, డిసెంబర్ 2 (సమ సమాజం):** తెలంగాణ వ్యాప్తంగా నేడు జరిగే కౌంటింగ్‌కు భారీగా ఏర్పాట్లు చేశారు. ఫలితాలను ఎప్పటికప్పుడు ప్రకటించేలా విస్తృతంగా ఏర్పాట్లు జరిగాయి. ఎన్నికల సంఘం ఆదేశాలతో పోలీసులు భారీగా మొహరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జర్కుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు. 49 కౌంటింగ్ కేంద్రాల్లో భారీ భద్రత చోటు చేసుకుంది. 119 నియోజకవర్గాల వారిగా కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 10గంటల కల్లా తొలి ఫలితం వచ్చేస్తుందని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ తెలిపారు. కౌంటింగ్ కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. మరోవైపు తెలంగాణ ఎన్నికల ఫలితాలపై రాష్ట్ర ప్రజలంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఏ పార్టీ అధికారంలోకి వస్తుందో తెలుసుకోవాలని ఆతృత పడుతున్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత, సీసీ కెమెరాలతో పర్యవేక్షణ నిర్వహించనున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చేల్ జిల్లాలో 29 కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగింది. కౌంటింగ్ కేంద్రాల వద్ద పోలీసుల ఆంక్షలు, 144 సెక్షన్ అమలు చేశారు. కౌంటింగ్ సందర్భంగా రోడ్లపై ర్యాలీలు, టపాసులు కాల్చడం, ఊరేగింపులపై నిషేధం విధించడం జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా నేడు మద్యం దుకాణాలు బంద్ చేశారు. ఉదయం 5గంటలకే కౌంటింగ్ కేంద్రాలకు అధికారులు, సిబ్బంది చేరుకోనున్నారు. లెక్కింపునకు ముందు గంటపాటు ఉద్యోగులకు దిశ నిర్దేశర చేయడం జరిగింది. ఆర్వో ధృవీకరించిన తర్వాత 20 నిమిషాల్లో ఒక్కో రౌండ్ ఫలితం వెలువడనుంది. వేగంగా ఫలితాలు ఇచ్చేందుకు ప్రత్యేక సాఫ్ట్ వేర్ ఏర్పాటు చేయడం జరిగింది. స్ట్రాంగ్ రూముల వద్ద 40 కేంద్ర కంపెనీల బలగాలతో భద్రత పెంపొందించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 2,290 మంది అభ్యర్థుల భవితవ్యం తేలనుంది. మొత్తం 1766 టేబుల్స్ ఏర్పాటు చేయడం జరిగింది.ఆదివారం ఉదయం 8గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభకానుండగా... ఫలితాల కోసం ఏర్పాట్లు కూడా జరిగాయి. గురువారం రాత్రే ఈవీఎంలను పార్టీ ఏజెంట్ల సమక్షంలోనే స్ట్రాంరూంలకు తరలించారు. ఈవీఎంలు భద్రపరిచిన గదుల దగ్గరకు ఎవరినీ అనుమతించడం లేదు. స్టాం÷-రగ్ రూంల దగ్గర సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంది. డీసీపీ స్థాయి అధికారి ఇద్దరు సీఐలు, నలుగులు ఎస్ఐలతో పాటు కేంద్ర బలగాలు స్టాం÷-రగ్ రూముల దగ్గర పహారా కాస్తున్నాయి. మొత్తం 40 కంపెనీల కేంద్ర బలగాలు ఈవీఎంల దగ్గర బందోబస్తు విధుల్లో ఉంచారు. ఓట్ల లెక్కింపు పక్రియ ప్రారంభమయ్యే వరకు రాష్ట్రంలో 144 సెక్షన్ అమల్లోనే ఉంటుంది. తెలంగాణ ఎన్నికల కౌంటింగ్‌కు పకడ్బంధీ ఏర్పాటు చేసినట్టు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 49 కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో హైదరాబాద్ నగరంలో అత్యధికంగా 14 లెక్కింపు కేంద్రాలు పెట్టారు. ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల ఓట్ల

3వ పేజీలో...

---

అయోధ్య రామమందిరానికి

## సర్వం సిద్ధం

సుమారు 6,000 మందికి ఆహ్వాలు



**న్యూఢిల్లీ, డిసెంబర్ 2 (సమ సమాజం):** యావత్తు భారతదేశం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఉత్తర్‌ప్రదేశ్‌లోని అయోధ్యలో చేపట్టిన రామ మందిరం ప్రారంభోత్సవానికి రంగం సిద్ధమైంది. జనవరిలో ఈ ఆలయం భక్తులకు అందుబాటులోకి రానుంది. పది రోజుల పాటు జరిగే ప్రతిష్ఠ ఉత్సవాలు వచ్చే ఏడాది జనవరి 16న ప్రారంభమవుతాయి.

3వ పేజీలో...

---

## తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం

ఎగ్జిట్ పోల్స్ కాదు..ఎగ్జాకట్ పోల్స్ వేరు

ఫలితాలు బిఆర్ఎస్‌కు అనుకూలంగా ఉంటాయి

మళ్లీ ప్రభుత్వం ఏర్పాటు కెసిఆర్‌దే

మీడియా సమావేశంలో స్పీకర్ పోచారం



**కామారెడ్డి, డిసెంబర్ 2 (సమ సమాజం):** తెలంగాణ రాష్ట్రంలో హ్యాట్రిక్ సీఎం కేసీఆర్ కాబోతున్నారని బాన్సువాడ బీఆర్ఎస్ అభ్యర్థి, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మరోమారు అధికారం బిఆర్ఎస్‌దే అన్నారు. ఎగ్జిట్ పోల్స్ తప్పు అని రుజువు కాబోతున్నదని అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ... మేము గెలుస్తున్నం. ఎగ్జిట్ పల్స్ వేరు, ఎగ్జాక్ట్ పోల్స్ వేరు. కొన్ని ఎగ్జిట్‌పోల్స్ సంస్థలు పార్టీలతో సంబంధాలు ఉన్నాయి. వారికి అనుకూలంగా

3వ పేజీలో...

---

## అధికార దుర్వినియోగం జరక్కుండా చూడండి



నిధుల మళ్లింపు, అసైన్డ్ భూముల మార్పు జరుగుతోంది

కెసిఆర్ అధికార దుర్వినయోగంపై కన్నేయండి

సిఇవో వికాస్ రాజ్‌తో కాంగ్రెస్ నేతల భేటీ..వినతిపత్రం అందచేత

**హైదరాబాద్, డిసెంబర్ 2 (సమ సమాజం):** తెలంగాణ ఎన్నికల ఫలితాల వేళ రాష్ట్రంలో అధికారం దుర్వినియోగం కాకుండా చూడాలని కాంగ్రెస్ నేతలు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్ రాజ్ ను కోరారు. ఈ మేరకు శనివారం ఉదయం ఆయన్ను కలిసి వినతి పత్రం సమర్పించారు. టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి , ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి, ప్రచార కమిటీ చైర్మెన్ మధుయాష్కీ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అంజన్ కుమార్ యాదవ్, ఇతర సీనియర్ నేతలు సీఈవోను కలిసిన వారిలో ఉన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా బీఆర్ఎస్ ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని ఈసీ దృష్టికి తీసుకొచ్చారు. ప్రధానంగా 4 అంశాలపై ఫిర్యాదు చేశారు. ఈ నెల 4న జరగబోయే కేబినెట్ భేటీలో కేసీఆర్ ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా నిలువరించాలని ఈసీని కోరినట్లు తెలుస్తోంది. అలాగే, నిధుల విడుదలకు సంబంధించి ప్రభుత్వ ఆదేశాలపైనా దృష్టి సారించాలని విజ్ఞప్తి చేసినట్లు సమాచారం. సీఈవోను కలిసిన అనంతరం కాంగ్రెస్ నేత ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం

3వ పేజీలో...

---

## కాంగ్రెస్ శ్రేణుల్లో ఫుల్ జోష్

రంగంలోకి దిగిన కర్నాటక డిప్యూటీ డికె

తమ ఎమ్మెల్యేలను ట్రాప్ చేసే పనిలో కెసిఆర్

సంచలన ఆరోపణలు చేసిన శివకుమార్




**బెంగళూరు, డిసెంబర్ 2 (సమ సమాజం):** 3న ఆదివారం తెలంగాణ ఎన్నికల ఫలితాలువెలువడనున్న నేపథ్యంలో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు కాంగ్రెస్ కు అనుకూలంగా రావడంతో ఆ పార్టీ శ్రేణుల్లో ఫుల్ జోష్ కనిపిస్తోంది. ఈ క్రమంలో కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బెంగళూరులో ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ సునాయాసంగా అధికారంలోకి వస్తుందని స్పష్టం చేశారు. 'కాంగ్రెస్

3వ పేజీలో...

---

## సౌర గాలులపై ఆదిత్య స్టడీ

### ఫొటో రిలీజ్ చేసిన ఇస్రో



**న్యూఢిల్లీ, డిసెంబర్ 2 (సమ సమాజం):** సూర్యుడి అధ్యయనం కోసం ప్రయోగించిన ఆదిత్య ఎల్1 మిషన్ దూసుకెళ్తున్నది. అయితే ఆ శాటిలైట్‌లో ఉన్న ఆదిత్య సోలార్ విండ్ పార్టికల్ ఎక్స్‌పరిమెంట్ పేలోడ్ సౌర గాలుల స్టడీని ప్రారంభించింది. ఆ స్టడీకి చెందిన నివేదికను ఇస్రో రిలీజ్ చేసింది. ప్రస్తుతం సోలార్ పేలోడ్ తన ఆపరేషన్స్ సక్రమంగా చేస్తున్నట్లు ఇస్రో వెల్లడించింది. విండ్ పార్టికల్ ఎక్స్‌పరిమెంట్‌లో రెండు పరికరాలు ఉన్నాయి. దాంట్లో సోలార్ విండ్ ఐయాన్ స్పెక్ట్రోమీటర్, సూప్రా థర్మల్ అండ్ ఎనర్జిటిక్ పార్టికల్ స్పెక్ట్రోమీటర్ ఉన్నాయి. సూప్రా థర్మల్ పరికరం సెప్టెబర్ 10వ తేదీ నుంచి యాక్షన్‌లో ఉంది. ఇక ఐయాన్ స్పెక్ట్రోమీటర్ శనివారమే తన పని ప్రారంభించింది. స్పెక్ట్రోమీటర్ పనితీరు

3వ పేజీలో...

---

## గ్రేటర్‌పై బిజెపి భారీ ఆశలు

కనీసం 6 సీట్లు గెలుస్తామన్న ధీమా

మొత్తంగా 20కి తగ్గవని అంటున్న నేతలు



**హైదరాబాద్, డిసెంబర్ 2 (సమ సమాజం):** నేడు ఫలితాలు వెలువడనున్న తరుణంలో అసెంబ్లీలో స్థానాలపై బిజెపి భారీగానే ఆశలు పెట్టుకుంది. కనీసం 20 సీట్లకు తగ్గక పోవచ్చని నమ్మకంగా చెబుతున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని, బిసి సిఎం అవుతాడని చెప్పినా.. 20 మాత్రం వస్తాయని అంటున్నారు. ప్రధానంగా

3వ పేజీలో...

---

## తెలంగాణ ఉద్యోగులకు శుభవార్త

డిఎ చెల్లింపునకు ఇసి అనుమతి

**హైదరాబాద్, డిసెంబర్ 2 (సమ సమాజం):** తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త. డీఏ చెల్లించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం అనుమతి ఇచ్చింది. ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగులకు మూడు డీఏలు పెండింగ్ లో ఉన్నాయి. అయితే ఒక డీఏ విడుదలకు అనుమతి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం ఈసీని కోరింది. దీనిపై తెలంగాణ ప్రభుత్వం, ఈసీ మధ్య చర్చలు

3వ పేజీలో...

---

## భారీ మెజార్టీతో విజయం సాధిస్తున్నా

బిజెపి నేత బండి సంజయ్ ధీమా



**కరీంనగర్, డిసెంబర్ 2 (సమ సమాజం):** కరీంనగర్‌లో భారీ మెజారిటీతో విజయం సాధించబోతున్నామని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ అన్నారు. ఎన్నికల్లో అధికార పార్టీ అనేకఅడ్డంకులు సృష్టించినా తట్టుకుని కాషా జెండాపట్టుకుని తెగించి కొట్లాడిన కార్యకర్తలే నిజమైన

3వ పేజీలో...

## బర్రెలక్క స్ఫూర్తితో నేను పోటీ చేస్తా



**ధర్మవరం, డిసెంబర్ 2 (సమ సమాజం):** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కొల్లాపూర్ నియోజకవర్గం నుంచి నిరుద్యోగ యువత కోసం అంటూ స్వతంత్ర్య అభ్యర్థిగా బరిలో దిగిన యూట్యూబ్ స్టార్ శిరీష (బర్రెలక్క)ను ఇతరులు స్ఫూర్తిగా తీసుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఒక మహిళా యూట్యూబ్ స్టార్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తా అంటున్నారు. తెలంగాణలో బర్రెలక్క మాదిరిగానే ఆంధ్రప్రదేశ్‌లో తాను కూడా నిరుద్యోగ యువత కోసం పోటీ చేస్తానని చెబుతున్నారు. శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం నియోజకవర్గానికి చెందిన దాసరి కవిత అలియాస్ జుమ్‌చక జుమ్‌చక స్టార్ ఏపీలో రాబోయే ఎన్నికల్లో పోటీ చేస్తానంటున్నారు. ముఖ్యంగా ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని ఓడిస్తానని జుమ్‌చక జుమ్‌చక స్టార్ సవాల్ చేస్తున్నారు. కవిత పది హామీలతో ఏకంగా మ్యానిఫెస్టో కూడా రిలీజ్ చేశారు. కవిత యూట్యూబ్ ఛానల్‌లో కంటెంట్ లేకపోయినా కామెడీగా ఉంటుందని వ్యూస్ బాగా వస్తుంటాయి.

# కాలుష్య నివారణకు చర్యలు తీసుకోవాలి

### కాలుష్య నియంత్రణ దినోత్సవంలో వక్తల పిలుపు


**విజయనగరం, డిసెంబర్ 2 (సమ సమాజం):** స్థానిక గాజులరేగ పరిధిలో గల సీతం ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గాయత్రి విద్యా సంస్థల విశ్రాంత ప్రొఫెసర్ ఏ.కామేశ్వరరావు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన విద్యార్థులను ఉద్దేశిస్తూ, మెరుగైన ప్రపంచం కోసం కీలక సవాళ్లను ఎదుర్కుంటూ కాలుష్యాన్ని తగ్గించడానికి మార్గాలను కనుగొనడం, పర్యావరణ పరిరక్షణ, మొదలుగు విషయాల గురించి అవగాహన కల్పించారు. సీతం డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, ఇటువంటి అవగాహన కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటూ కాలుష్య నియంత్రణ మార్గాలను అన్వేషించాలని, కాలుష్యరహిత సమాజం కోసం తమ వంతు కృషి చేయాలని విద్యార్థులను కోరారు. సీతం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి. రామమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు నూతనంగా ఆలోచించి దేశాభివృద్ధికి దోహదపడేలా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ జి.రవికిషోర్, ఇతర అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# కలచివేస్తున్న గుండెపోటు మరణాలు

గుజరాత్‌లో 6 నెలల్లో 1000 మృతి

చిన్నాపెద్ద తేడా లేకుండా పెరుగుతున్న గుండెపోటు బాధితుల సంఖ్య

2 లక్షలకుపైగా మందికి సిపిఆర్‌పై అవగాహన



**న్యూఢిల్లీ, డిసెంబర్ 2 (సమ సమాజం):** దేశవ్యాప్తంగా ఆకస్మిక గుండెపోటు మరణాలు అందరినీ కలచివేస్తున్నాయి. పసిప్రాయం మొదలు నడివయస్సు వరకు పలువురు గుండెపోటుతో ప్రాణాలు కోల్పోతున్నారు. మరీముఖ్యంగా యువతే ఎక్కువగా గుండెపోటు బారిన పడి ప్రాణాలు వదులుతున్నారు. ఈ మధ్య నిత్యం ఇలాంటి ఘటనలే ఎక్కువగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా కరోనా తర్వాత యువగుండెకు ముప్పు వాటిల్లుతోంది. అప్పటివరకూ బాగానే ఉన్నవారు అంతలోనే ఉన్నచోటే కుప్పకూలి గుండెపోటుతో ప్రాణాలు వదులుతున్నారు. ఇక గుజరాత్ రాష్ట్రంలో గుండెపోటు మరణాలు మరీ అధికంగా ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా కేవలం ఆరు నెలల వ్యవధిలోనే ఏకంగా వెయ్యికిపైగా గుండెపోటు మరణాలు నమోదు కావడం ఇప్పుడు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చినీయాంశమవుతోంది. గడిచిన ఆరు నెలల్లో గుండెపోటు కారణంగా 1,052 మంది ప్రాణాలు కోల్పోయినట్లు ఆ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా వెల్లడించింది. వీరిలో 80 శాతం మంది 11-25 ఏళ్ల మధ్య ఉన్న వారేనని తెలిపింది. ఇలా గుండెపోటు ఘటనలు పెరుగుతోన్న నేపథ్యంలో సీపీఆర్‌పై దాదాపు 2లక్షల మంది టీచర్లు, కాలేజీ ప్రొఫెసర్లకు శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. 'గుండెపోటుతో ఆరు నెలల్లో 1,052 మంది ప్రాణాలు కోల్పోయారు. వారిలో 80శాతం మంది 11-25 ఏళ్ల మధ్య వయసువారే. ఈ విద్యార్థులు, యువకులకు ఊబకాయులు కూడా కాదు. హృదయ సంబంధిత కారణాలతో రోజుకు సగటున 173 కాల్స్ ఎమర్జెన్సీ విభాగానికి వస్తున్నాయి' అని గుజరాత్ విద్యాశాఖ మంత్రి కుబేర్ డిండోర్ వెల్లడించారు. 'బాధితుల్లో ఎక్కువగా చిన్నవయసు వారే ఉండటంతో గుండెపోటుపై యువకుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. క్రికెట్ ఆడుతుండగా, గార్బా నృత్యం చేస్తున్న సమయంలో ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ మరణాల నేపథ్యంలో టీచర్లు సీపీఆర్‌పై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉంది. దాదాపు రెండు లక్షల మంది టీచర్లు, ప్రొఫెసర్లకు శిక్షణ ఇవ్వనున్నాం. ఈ శిక్షణలో 2,500 మంది వైద్య నిపుణులు పాల్గొంటారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ శిక్షణా కార్యక్రమంలో ఉపాధ్యాయులందరూ భాగస్వామ్యం కావాలి' అని మంత్రి సూచించారు.

# అంతిమ విజయం బిఆర్ఎస్‌దే

### కెసిఆర్ హ్యాట్రిక్ సిఎం: దాసోజు



**హైదరాబాద్, డిసెంబర్ 2 (సమ సమాజం):** తెలంగాణలో బీఆర్ఎస్ గెలుపు ఖాయమని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ధీమా వ్యక్తం చేశారు. మళ్లీ గెలుపు బిఆర్ఎస్‌దేనని, కెసిఆర్ సిఎం కాబోతున్నారని ధీమా వ్యక్తం చేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. ముమ్మాటికీ 70 సీట్లకు పైగా బీఆర్ఎస్ యే గెలుస్తుందని.. మూడోవ సారి కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని అన్నారు. తెలంగాణ ప్రజలతో కేసీఆర్ ది పేగు బంధమని చెప్పుకొచ్చారు. ఎగ్జిట్ పోల్‌కు ఎగ్జాక్ట్ పోల్స్‌కు మధ్య చాల తేడా ఉంటుందన్నారు. కేసీఆర్ ప్రజల గుండెల్లో ఉన్నారన్నారు. కాంగ్రెస్ నేతలు లేఖి తనం చూపిస్తున్నారని విమర్శించారు. చిల్లర ప్రచారం చేస్తున్నారన్నారు. అధికారం లేకుండానే ఇంత లేఖి తనం చూపిస్తున్నారన్నారు. సంప్రదాయాలు తెలియకుండా క్యాబినెట్ మీటింగ్ గురించి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కర్ణాటక నేతలకు తెలంగాణలో ఏం పని అని ప్రశ్నించారు. కర్ణాటక నేతలు గద్దల్లాగా వచ్చి పడుతున్నారని దాసోజు శ్రవణ్ విమర్శలు గుప్పించారు.

# కేసీఆర్‌కు వైఎస్ షర్మిల వెరైటీ గిఫ్ట్..

### బైబై కేసీఆర్ అంటూ..సూట్‌కేసు




**హైదరాబాద్, డిసెంబర్ 2 (సమ సమాజం):** తెలంగాణలో ఆదివారం ఎన్నికల ఫలితాలు వెల్లడికానున్నాయి. గెలుపు తమదే అంటే తమదే అంటూ అన్ని పార్టీలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. ఈ క్రమంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు వైఎస్సార్టీపీ అధినేత్రి వైఎస్ షర్మిలారెడ్డి వెరైటీ గిఫ్ట్ పంపించారు. బైబై కేసీఆర్ అంటూ కేసీఆర్‌కు సూట్ కేసును గిఫ్ట్‌గా పంపించారు. సందర్భంగా షర్మిల మాట్లాడుతూ.. బైబై కేసీఆర్..కేసీఆర్ సూట్ కేసు పట్టుకుని సర్దుకునే టైం వచ్చింది. కేసీఆర్ గారు ప్యాక్ అప్ చేసుకోండి. బైబై కేసీఆర్ అంటూ వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ పాలనకు ఎండ్ కార్డ్ పడబోతుందన్నారు. కేసీఆర్ ప్యాక్ అప్ చేసుకునే టైం వచ్చిందని... ఆయనకు ఒక గిఫ్ట్ ఇస్తున్నామని అన్నారు. కర్నాటక ఎన్నికల్లో 71 మంది పదివేల మెజార్టీతో గెలిచారు. పదివేల మెజార్టీ అయినా కూడా ముఖ్యం కాబట్టి.. తాము పోటీ చేసి ఒకవేల 5,000 ఓట్లు చీల్చినా తేడా వస్తుందని.. కేసీఆర్‌ను ఓడించాలని కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చామని అన్నారు. ఇన్నాళ్లు బీజేపీ, బీఆర్ఎస్ కలిసే ఉన్నారని తెలంగాణ ప్రజలకు అర్థం అయ్యిందన్నారు. కేసీఆర్ అవినీతి మీద బీజేపీ ఒక్క యాక్షన్ కూడా తీసుకోలేదని విమర్శించారు. వీళ్లిద్దరు తోడుదొంగలు అయి కలిసే ఉన్నారని ఆరోపించారు. కేసీఆర్‌కు మించిన కరెప్ట్ పొలిటీషియన్ లేరని అమిత్ షా చెప్పారు. ఆయన ఏ స్కీం లు చేసినా అవినీతే అని మోదీ చెప్పారు... మీరు మీరు కలిసి లేకపోతే మేం ఎంక్వైరీ వేయాలని కోరినా ఒక్క యాక్షన్ కూడా ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్, బీజేపీ రెండు పార్టీలు ఒకటి కాకపోతే ఈ ఎన్నికల్లో మద్దతు ఇవ్వకుండా ఉండాలన్నారు. దీన్ని రిఫరాండంగా తీసుకోవాలి తప్ప ఎమ్మెల్యేలను కొనుగోలు చేయొద్దని అన్నారు. 2014, 2018లో 45 మందిని కేసీఆర్ కొన్నారని.. కేసీఆర్ కొన్న ఎమ్మెల్యేలు 40, ఎమ్మెల్సీ 4, ఎంపీ 1 రిని కొన్నారని తెలిపారు. ఇది మళ్లీ రిపీట్ కాకూడదని.. బ్యాక్ డోర్ పాలిటిక్స్ చేసి అధికారంలోకి వచ్చే విధంగా చేయకూడదని కేసీఆర్‌ను తాము డిమాండ్ చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీలో క్రెడిబిలిటీ ఉన్న వాళ్లు చాలా మంది ఉన్నారని చెప్పారు. ప్రభుత్వం మారాలని.. ఎవరు ముఖ్యమంత్రికావాలన్నది కాంగ్రెస్ పార్టీ నిర్ణయిస్తుందని వైఎస్ షర్మిలారెడ్డి చెప్పుకొచ్చారు.

# 15 ఏళ్లకే వివాహం... ప్రశ్నించినందుకు భార్య హతం

**చెన్నై, డిసెంబర్ 2 (సమ సమాజం):** వారిద్దరిది ప్రేమ వివాహం. 15 ఏండ్ల వయసు ఉన్నప్పుడే పెళ్లి చేసుకున్నారు. కానీ భర్తకు వివాహేతర సంబంధాలు ఉన్నాయని తెలిసి, భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. దాంతో అతను జైలు పాలయ్యాడు. జైలు నుంచి విడుదలైన తర్వాత మళ్లీ ఒక్కటయ్యారు. కానీ అతను ఇతర మహిళలతో సన్నిహితంగా ఉంటున్నాడు. దీనిపై భర్తను ప్రశ్నించినందుకు ఆమెను గొంతు నులిమి చంపాడు. ఈ ఘటన తమిళనాడు రాజధాని చెన్నై నగరంలో వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్తే.. కేరళకు చెందిన ఫౌసియా(20) చెన్నైలోని క్రోమ్‌పేట్‌లో ఉన్న నర్సింగ్ కాలేజీలో సెకండియర్ చదువుతోంది. న్యూ కాలనీలోని ఓ ప్రయివేటు హాస్టల్‌లో ఉంటుంది. కేరళలోని కొల్లాంకు చెందిన ఆషిక్(20) గత కొన్నేండ్ల నుంచి ఫౌసియాను ప్రేమిస్తున్నాడు. ఈ క్రమంలో ఐదేండ్ల క్రితం వివాహం చేసుకున్నారు. మూడేండ్ల వరకు కలిసిమెలిసి ఉన్నారు. అయితే ఆషిక్ ఇతర అమ్మాయిలతో సన్నిహితంగా ఉంటున్నట్లు ఫౌసియా గ్రహించింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, జైలుకు తరలించారు. గత కొంతకాలం క్రితం ఆషిక్ జైలు నుంచి విడుదలయ్యాడు. ఫౌసియాను క్షమాపణలు కోరాడు. మళ్లీ పొరపాటు జరగనివ్వని ప్రాధేయపడ్డాడు. దీంతో ఇద్దరు అప్పుడప్పుడు కలుసుకునేవారు. ఇక మూడో రోజుల క్రితం క్రోమ్‌పేట్‌లోని ఓ హోటల్‌లో దిగారు. అతని ఫోన్‌ను పరిశీలించగా, ఇతర అమ్మాయిలతో సన్నిహితంగా ఉన్న ఫోటోలు కనిపించాయి. ఆ ఫోటోలపై నిలదీయగా, ఆవేశంలో ఫౌసియా గొంతు నులిమి చంపాడు. ఆమె డెడ్‌బాడీ ఫోటోలను వాట్సాప్ స్టాటస్‌గా పెట్టుకున్నాడు. దీంతో ఫౌసియా, ఆషిక్ ఫ్రెండ్స్ కలిసి పోలీసులకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన పోలీసులు.. సీసీటీవీ ఫుటేజీ ద్వారా కేసు దర్యాప్తు చేశారు. క్రోమ్‌పేట్‌లోని హోటల్‌లో ఫౌసియా డెడ్‌బాడీ గుర్తించారు. ఆమె మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం క్రోమ్‌పేట్ గవర్నమెంట్ ఆస్పత్రికి తరలించారు. అయితే ఫౌసియా, ఆషిక్‌కు ఒక పాప ఉందని, ఆమెను చిక్‌మగళూరులో దత్తత ఇచ్చారని పోలీసుల దర్యాప్తులో తేలింది.

# తెలంగాణలో నేడు ఎన్నికల ఫలితాలు

### రాష్ట్రవ్యాప్తంగా మద్యం దుకాణాల మూసివేత




**హైదరాబాద్, డిసెంబర్ 2 (సమ సమాజం):** తెలంగాణ ఎన్నికల ఫలితాలకు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. ఆదివార ఉదయం 8 గంటలకు లెక్కింపు ప్రారంభం కానుండగా 10 గంటలకల్లా తొలి ఫలితం రానుంది. మరికొన్ని గంటల్లో అభ్యర్థుల భవితవ్యం తేలిపోనుంది. 119 నియోజకవర్గాల్లో ఓటర్ల తీర్పు ఈవీఎంలలో నిక్షిప్తమై ఉంది. ఈసారి బీఆర్ఎస్ హ్యాట్రిక్ కొడుతుందా.. లేదంటే చెయ్యి పార్టీ అధికారాన్ని హస్తం గతం చేసుకుంటుందో తేలిపోనుంది. ఫలితాలపై నేతల్లో.. ప్రజల్లో నరాలు తెగే ఉత్కంఠ సాగుతోంది. ఇంకోవైపు బెట్టింగ్‌లు కూడా పెద్ద ఎత్తున నడుస్తున్నాయి. ఈ క్రమంలో మందు పార్టీల కోసం ఏర్పాట్లు సాగుతు న్నాయి. అయితే మద్యం దుకాణాల మూసివేతకు ఇసి ఆదేశాలు ఇచ్చింది. ఆదివారం షాపులు మూపతడనున్నారు. ఇక ఆదివారం ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా రాష్ట్రం వ్యాప్తంగా మందు షాపులు మూసివేయాలని పోలీస్ శాఖ ఆదేశించింది. ఈ మేరకు వైన్ షాపు యజమానులకు నోటీసులు జారీ చేసారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అలాగే భాగ్యనగరంలో వైన్ షాపులు మూసివేయాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సందీప్ శాండిల్యా ఆదేశాలు జారీ చేశారు. కౌంటింగ్ కేంద్రాల దగ్గర పటిష్టమైన భద్రతా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ర్యాలీల్లో ఉద్రిక్తతలు చోటుచేసుకుండా చర్యలు చేపట్టారు. మద్యం షాపులతో పాటు, బార్లు కూడా మూతపడనున్నాయి.

# వాతావరణం బాగాలేక 18 విమానాలు దారి మళ్లింపు

**న్యూఢిల్లీ, డిసెంబర్ 2 (సమ సమాజం):** ఢిల్లీలో శనివారం వెదర్ సరిగా లేదు. దీంతో ఆ విమానాశ్రయానికి రావాల్సిన 18 విమానాలను దారి మళ్లించారు. కొన్ని విమానాలను జైపూర్, లక్నో, అహ్మదాబాద్, అమృత్‌సర్‌కు మళ్లించినట్లు అధికారులు చెప్పారు. లో విజుబిలిటీ వల్ల ఢిల్లీ విమానాశ్రయంలో ఈ పరిస్థితి తలెత్తినట్లు అధికారులు వెల్లడించారు.

# బంగ్లాదేశ్‌లో భూకంపం

### రిక్టర్‌స్కేల్‌పై 5.6గా నమోదు



**న్యూఢిల్లీ, డిసెంబర్ 2 (సమ సమాజం):** బంగ్లాదేశ్‌లో శనివారం ఉదయం 5.6 తీవ్రతతో భారీ భూకంపం సంభవించిన విషయం తెలిసిందే. చిట్టగాంగ్‌లో భూ అంతర్భాగంలో 55 కిలోమీటర్ల లోతులో కదలికలు సంభవించాయని నేషనల్ సెంటర్ ఫర్ సీస్మోలజీ వెల్లడించింది. ఈ భూకంపం కారణంగా పొరుగున ఉన్న పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోనూ భూ ప్రకంపనలు చోటు చేసుకున్నాయి. బెంగాల్‌లోని కోల్‌కతా సహా పలు ప్రాంతాల్లో భూమి ఒక్కసారిగా కంపించింది. దీంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. అయితే, ఈ ప్రకంపనల కారణంగా రాష్ట్రంలో ఎలాంటి నష్టం వాటిల్లలేదని పశ్చిమ బెంగాల్ విపత్తు నిర్వహణ శాఖ తెలిపింది. 'ఇప్పటి వరకూ అందిన సమాచారం మేరకు.. భూకంపం కారణంగా ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లలేదు' అని అధికారులు తెలిపారు. కోల్‌కతా పోలీసులు, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు కూడా ఇదే విషయాన్ని వెల్లడించింది. కాగా, శనివారం ఉదయం 9.41 గంటలకు చిట్టగాంగ్‌లోని రామ్‌గంజ్‌లో భూమి కంపించింది. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 5.6గా నమోదయిందని నేషనల్ సెంటర్ ఫర్ సీస్మోలజీ తెలిపింది. భూ అంతర్భాగంలో 55 కిలోమీటర్ల లోతులో కదలికలు సంభవించాయని వెల్లడించింది. రామ్‌గంజ్ సమీపంలో భూకంప కేంద్రం ఉన్నదని తెలిపింది. నిమిషాల వ్యవధిలో చిట్టగాంగ్ ప్రావిన్స్‌లోని లక్ష్మీపూర్, చాంద్‌పూర్, కొమిల్లాలో భూమి కంపించిందని పేర్కొంది. అదేవిధంగా రాజ్‌షాహి, సిల్హెట్, ఢాకా, నౌవాఖలి, కుష్టియాలో కూడా ప్రకంపణలు చోటుచేసుకున్నాయని చెప్పింది. భూకంపం వల్ల జరిగిన నష్టానికి సంబంధించిన వివరాలు ఇంకా తెలియరాలేదని అధికారులు చెప్పారు.

# బోటు దగ్ధంతో మత్స్యకారులకు నష్టం

### సాయం కోసం ప్రభుత్వాన్ని అర్థించామన్న జివిఎల్



**విశాఖపట్నం, డిసెంబర్ 2 (సమ సమాజం):** విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో బోట్లు దగ్ధమైన స్థలాన్ని బీజేపీ నేత జీవీఎల్ నరసింహారావు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఫిషింగ్ హర్బర్ ప్రమాదంలో మత్స్యకారులకు అపారమైన నష్టం జరిగిందన్నారు. మత్స్యకారులను తక్షణమే న్యాయం చేయమని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరామన్నారు. బాధిత మత్స్యకారులకు న్యాయం జరిగేలా కేంద్ర ప్రభుత్వం సహకరిస్తుందని తెలిపారు. దగ్ధమైన బోట్లను బయటికి వెలికితీయమని పోర్టు అధికారులతో మాట్లాడామని.. వెలికితీసిన బోట్లలను, బోటు యజమానికే ఇవ్వమని కోరడం జరిగిందన్నారు. పూర్తిగా పోర్టు ట్రస్టు ఆధ్వర్యంలో బోటులను వెలికితీయనున్నారన్నారు. ఖర్చులన్నీ పోర్టు అధికారులే భరించనున్నారని తెలిపారు. త్వరలో బ్యాంకు అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి, ఋణాలను ఇచ్చే విధంగా కృషి చేస్తున్నామని జీవీఎల్ నరసింహారావు వెల్లడించారు.

# విరిగిపడ్డ బారీ వృక్షం

### విద్యార్థులకు తప్పిన ముప్పు

**సంగారెడ్డి, డిసెంబర్ 2 (సమ సమాజం):** జిల్లాలోని పుల్కల్‌లో విద్యార్థులకు తృటిలో పెను ప్రమాదం తప్పింది. పుల్కల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో అకస్మాత్తుగా విద్యుత్తు వైర్లపై భారీ వృక్షం విరిగిపడింది. ఉపాధ్యాయులు,విద్యార్థులు వెంటనే అప్రమత్తమవడంతో పెను ప్రమాదం తప్పింది. వెంటనే స్థానికులు అక్కడకు చేరుకుని పాఠశాల బిల్డింగ్‌పై విరిగిపడిన చెట్టు కొమ్మలను తొలగించే పనిలో పడ్డారు.

## అయోధ్య రామమందిరానికి

# సర్వం సిద్ధం



(మొదటి పేజీ తరువాయి) ఆలయ గర్భగుడిలో రాముని విగ్రహ ప్రతిష్ఠను 2024 జనవరి 22 మధ్యాహ్నం 12.45-1.00 గంటల మధ్య నిర్వహించనున్నట్టు శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ ప్రతిష్ఠాపన మహోత్సవానికి ప్రధాని మోదీ ముఖ్య అతిథిగా విచ్చేయనున్నారు. ఇక ప్రాణప్రతిష్ఠాపన కార్యక్రమానికి మొత్తం 6,000 మంది ప్రముఖులను ఆహ్వానిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ పోస్టు ద్వారా అందరికీ ఆహ్వానాలు పంపినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. పూజారులు, దాతలు సహా దేశంలోని పలువురు రాజకీయ నాయకులు సహా మొత్తం 6,000 మంది అతిథులకు ఆహ్వానాలు పంపినట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా ఉన్న పలువురు పూజారులు, సాధువులే కాదు, ప్రధాని మోదీ, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తో సహా అగ్ర రాజకీయ నాయకులు కూడా జనవరి 22న జరిగే వేడుకల్లో పాల్గొననున్నారు. అయోధ్య సాధువులు అతిథులను సాదరంగా ఆహ్వానించనున్నారు. మరోవైపు రామమందిర ప్రారంభోత్సవం సందర్భంగా ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం జనవరి 2024లో రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల్లో అఖండ రామాయణం, హనుమాన్ చాలీసా పారాయణాలను నిర్వహించనుందని వారు వెల్లడించారు. మరోవైపు ఆలయ నిర్మాణ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. ఈ ఏడాది చివరికల్లా పనులు పూర్తయితాయని రామ జన్మభూమి క్షేత్ర ట్రస్ట్ ఇప్పటికే తెలిపింది.

# నేడే ఓట్ల లెక్కింపు

(మొదటి పేజీ తరువాయి)



లెక్కింపు కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో చేపడుతున్నారు. మిగిలిన 13 నియోజకవర్గాలకు విడిగా కేంద్రాలు ఏర్పాటు చేశారు. అలాగే... రంగారెడ్డి జిల్లాలో నాలుగు, మిగిలిన జిల్లాల్లో ఒక్కొటి చొప్పున ఓట్ల లెక్కింపు కేంద్రాలను సిద్ధం చేశారు అధికారులు. కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్ కోసం మొత్తం 17వందల 66 టేబుల్స్ ఏర్పాటు చేశారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో 500 పోలింగ్ కేంద్రాల కంటే ఎక్కువగా ఉన్న ఆరు నియోజకవర్గాల్లో 28 టేబుల్స్, మిగిలిన నియోజకవర్గాల్లో 14 చొప్పున ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ప్రతి కౌంటింగ్ టేబుల్ వద్ద నలుగురు ఎన్నికల సిబ్బంది ఉండనున్నారు. ఒక్కో టేబుల్ దగ్గర మైక్రో అబ్జర్వర్, ఒక కౌంటింగ్ సూపర్ వైజర్, ఇద్దరు అసిస్టెంట్లను కేటాయించారు. చిన్న నియోజకవర్గంలో ఉదయం 10గంటలకల్లా ఫలితం వెలువడే అవకాశం ఉంది. ఇక, పోస్టల్ బ్యాలెట్‌ల లెక్కింపు కోసం ప్రత్యేకంగా 500 ఓట్లకు ఒక టేబుల్ చొప్పున ఏర్పాటు చేస్తున్నామన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కూడా సమాంతరంగా జరుగుతుందని చెప్పారు వికాస్‌రాజ్. లక్షా 80వేల మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నార న్నారు. తెలంగాణ ఎన్నికల బరిలో 2వేల 290 మంది అభ్యర్థులు ఉండగా... వీరిలో 221 మంది మహిళలు, ఒకరు ట్రాన్స్‌జెండర్. తెలంగాణలో మొత్తం 71.06 శాతం పోలింగ్ జరిగిందన్నారు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్. మునుగోడులో అత్యధికంగా 91.5 శాతం పోలింగ్ నమోదు కాగా.. యాకుత్‌పురాలో అత్యల్పంగా 39.6శాతం పోలింగ్ నమోదైనట్లు వికాస్ తెలిపారు. గత ఎన్నికలతో పోలిస్తే మూడు శాతం పోలింగ్ తగ్గిందని చెప్పారు. రాష్ట్రంలో ఎక్కడా రీపోలింగ్‌కు అవకాశం లేదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో 79 నియోజకవర్గాల్లో 75శాతం కంటే ఎక్కువ పోలింగ్ నమోది. స్ట్రాంగ్ రూంలకు అన్ని రకాలుగా భద్రత చర్యలు తీసుకున్నామని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని వెల్లడించారు. 49 ప్రాంతాల్లో లెక్కింపు కేంద్రాలు ఉన్నాయని వివరించారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశారు. ప్రతి కౌంటింగ్ టేబుల్ వద్ద నలుగురు ఎన్నికల సిబ్బంది ఉంటారని వెల్లడించారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా 1.80 లక్షల మంది ఎన్నికల సిబ్బంది ఓటు హక్కు వినియోగించుకున్నారని పేర్కొన్నారు. కూకట్‌పల్లి, ఉప్పల్, మల్కాజ్‌గిరి, పఠాన చెరువు, నియోజకవర్గాల్లో పోలింగ్ కేంద్రాలు 400 పైగా ఉండటంతో ఇక్కడ మాత్రం 20 టేబుల్స్ ఏర్పాటు చేశారు. రాజేంద్రనగర్, ఎల్బీనగర్, శేర్‌లింగంపల్లి, మహేశ్వరం, మేడ్చల్ నియోజకవర్గాల్లో 500 పైగా పోలింగ్ కేంద్రాలుండటంతో 28 టేబుల్స్ ఏర్పాటు చేయడం జరిగింది.రేపు జరుగనున్న కౌంటింగ్ ఏర్పాట్లపై సీపీలు, ఎస్పీలతో డీజీపీ అంజనీ కుమార్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు.

## గ్రేటర్‌పై బిజెపి భారీ ఆశలు



(మొదటి పేజీ తరువాయి) హైదరాబాద్‌పై భారీగా ఆశలు పెట్టుకున్నారు. మొత్తంగా ఆదివారం ఇవిఎంలు లెక్కిస్తే ఎన్ని వస్తాయో తెలియగలదు. పోలింగ్ అనంతరం ఓటింగ్ సరళిని బట్టి గ్రేటర్‌లో ఆరు స్థానాలపై బీజేపీ అగ్రనేతలు ఆశలు పెట్టుకున్నారు. త్రిముఖ పోటీలో తమ అభ్యర్థులదే పై చేయి అవుతుందని అంచనా వేస్తున్నారు. బీజేపీకి హైదరాబాద్ ప్రతిష్ఠాత్మకం. 2014లో ఐదు స్థానాల్లో ఆ పార్టీ అభ్యర్థులు విజయం సాధించారు. 2018లో ఒకే స్థానంతో బీజేపీ సరిపెట్టుకుంది. ప్రస్తుతం కౌంటింగ్ ప్రారంభం కానుండడంతో ఫలితాలపై ఆ పార్టీ నేతలు లెక్కల్లో మునిగిపోయారు. ఈ ఫలితాల ప్రభావం పార్లమెంట్ ఎన్నికలపై ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. గోషామహల్ నుంచి రాజాసింగ్, రాజేంద్రనగర్ నుంచి తోకల శ్రీనివాస్‌రెడ్డి, మహేశ్వరం నుంచి అందెల శ్రీరాములు యాదవ్, అంబర్‌పేట నుంచి కృష్ణాయాదవ్, శేరిలింగంపల్లి నుంచి రవికుమార్ యాదవ్, కుత్బుల్లాపూర్ నుంచి కూన శ్రీశైలంగౌడ్ విజయం సాధిస్తారని బీజేపీ నేతలు చెబుతున్నారు. ఒకవేళ ఇందులో ప్రతికూల ఫలితం వచ్చినా గ్రేటర్‌లోని మిగతా ప్రాంతాల్లో విజయం వరిస్తుందని ధీమాగా ఉన్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు, ఓటింగ్ సరళి, త్రిముఖ పోటీ తమకు కలిసొస్తుందని పలువురు అభ్యర్థులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. గ్రేటర్‌లోని కొన్ని నియోజకవర్గాల్లో రెండో స్థానంలో ఉంటామని, లేకపోతే అక్కడ గెలిచినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ఖైరతాబాద్, కంటోన్మెంట్, మలక్‌పేట, ఉప్పల్, ఎల్బీనగర్, యాకుత్‌పురా నియోజక వర్గాల్లో పార్టీ అభ్యర్థులు గట్టి పోటీ ఇచ్చారని, ఇక్కడ రెండో స్థానంలో నిలిచే అవకాశాలున్నాయని భావిస్తున్నారు. ఇందులోని ఒకటి, రెండు స్థానాల్లో గట్టెక్కే అవకాశాలు కనిపిస్తున్నాయని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. యాకుత్‌పురాలో ఈ సారి పోలింగ్ శాతం తగ్గిందని, ఇది ప్రత్యర్థులకు మైనస్ అయి తమకు లాభిస్తుందని భావిస్తున్నారు. అయితే ఎన్ని సీట్లు వస్తాయన్నది ఆదివారం నాటి ఫలితాలను బట్టి తేలనుంది.


## అధికార దుర్వినియోగం జరక్కుండా చూడండి



(మొదటి పేజీ తరువాయి) నిబంధనలు పాటించడం లేదని, ఆ పార్టీకి సంబంధించిన కాంట్రాక్టర్లకు నిధులు మంజూరు చేయిస్తున్నారని కాంగ్రెస్ నేతలు సీఈవోకు ఫిర్యాదు చేశారు. 'రైతు బంధు నిధులను కాంట్రాక్టర్ల బిల్లులకు మళ్లిస్తున్నారు. సుమారు రూ.6 వేల కోట్లను తమకు నచ్చిన వారికి ఇచ్చేందుకు సర్కారు యత్నిస్తోంది. సంగారెడ్డి, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని భూముల్ని ధరణి పోర్టల్ లోకి మార్చేస్తున్నారు. అసైన్డ్ భూములు ఇతరుల పేర్లపై రిజిస్ట్రేషన్ చేయకుండా చూడాలి. ఆ భూముల రికార్డులు మారకుండా చూడాలి.' అని ఈసీని కోరినట్లు చెప్పారు. ప్రభుత్వ లావాదేవీలపై నిఘా పెట్టాలని, 4 అంశాలపై వికాస్ రాజ్ కు ఫిర్యాదు చేసినట్లు వివరించారు. ఎన్నికల ఫలితాల వేళ సోమవారం కేబినెట్ భేటీలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎలాంటి విధానపరమైన నిర్ణయాలు తీసుకోకుండా నిలువరించాలని ఈసీని కోరినట్లు ఉత్తమ్ తెలిపారు. 'ఎన్నికల ఫలితాల వేళ ప్రభుత్వం ఎలాంటి నిర్ణయాలు తీసుకోకూడదు. ఆదివారం గెలుపు ధ్రువపత్రాలను మా చీఫ్ ఎలక్షన్ ఏజెంట్లు తీసుకుంటారు. ఈ మేరకు ఆదేశాలు ఇవ్వాలని సీఈవోను కోరాం.' అని చెప్పారు. సీఎం కేసీఆర్ కేబినెట్ భేటీ ఎందుకు ఏర్పాటు చేశారో తెలియదని, రాజీనామాలు సమర్పించేందుకే కేబినెట్ మీటింగ్ ఏర్పాటు చేసి ఉండొచ్చని పేర్కొన్నారు. సిఈవోతో భేటీ అనంతరం ఉత్తమ్ మాట్లాడుతూ.. రైతుబంధు నిధుల దారి మళ్లింపుపై ఢిల్లీలో సీఈసీ దృష్టికి కూడా తీసుకెళ్లామన్నారు. నాలుగు అంశాలపై సీఈవో వికాస్‌రాజ్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. రైతుబంధు నిధులను మళ్లిస్తున్నారని ఫిర్యాదు చేశామన్నారు. భూ రికార్డులు మారుస్తున్నట్టు తమకు సమాచారం ఉందన్నారు. అసైన్డ్ ల్యాండ్స్ రికార్డులు మారుస్తున్నారన్నారు. ప్రభుత్వ లావాదేవీలపై నిఘా పెట్టాలని సీఈసీకి ఫిర్యాదు చేశామని ఉత్తమ్‌కుమార్ వెల్లడించారు.

## సౌర గాలులపై ఆదిత్య స్టడీ

(మొదటి పేజీ తరువాయి)



బాగానే ఉందని ఇస్రో చెప్పింది. ఆదిత్య పేలోడ్ పరికరం తీసిన ఫోటోను ఇస్రో తన ఎక్స్ అకౌంట్‌లో షేర్ చేసింది. ప్రోటాన్, ఆల్ఫా పార్టికల్స్‌లో ఉన్న ఎనర్జీ తేడాలను ఈ ఫోటోలో గమనించవచ్చు. రెండు రోజుల్లో ప్రోటాన్, ఆల్ఫా పార్టికల్ కౌంట్‌లో తేడా ఉన్నట్లు ఆదిత్య శాటిలైట్ గుర్తించినట్లు తెలుస్తోంది.

# తెలంగాణ ఉద్యోగులకు శుభవార్త

(మొదటి పేజీ తరువాయి) జరిగాయి. డీఏ చెల్లింపు ఆలస్యమైందని చెప్పగా ఒక డీఏ విడుదలకు ఎలాంటి అభ్యంతరం లేదని ఈసీ చెప్పడంతో ప్రభుత్వ ఉద్యోగులకు త్వరలో ఒక డీఏ చెల్లించనున్నారు. గతంలో డీఏల చెల్లింపు విధానంపై ఈసీ ఆరా తీసింది. ఎన్నికల సమయంలో ఇప్పుడెందుకు డీఏ ఇవ్వాలనుకుంటున్నారని సైతం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఈసీ ప్రశ్నించింది. ఉద్యోగులకు మూడు డీఏలు పెండింగ్ లో ఉన్నాయని, అనుమతి ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం ఈసీకి విజ్ఞప్తి చేసింది. తాజాగా రాష్ట్రంలో ఎన్నికలు ముగియడంతో ఒక డీఏ విడుదల చేయవచ్చునని, అందుకు అభ్యంతరం లేదని స్పష్టం చేసింది. ఉద్యోగ సంఘాలు సైతం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ద్వారా డీఏ కోసం ఈసీని కోరారు. దాంతో ఎట్టకేలకు ఒక డీఏ విడుదలకు అనుమతి ఇచ్చింది ఈసీ.

# భారీ మెజార్టీతో విజయం సాధిస్తున్నా

(మొదటి పేజీ తరువాయి) హీరోలన్నారు. మంత్రి గంగుల కమలాకర్ ఓటమి ఖాయమని అన్నారు. కరీంనగర్‌లో ప్రశాంత వాతావరణ నెలకొల్పి అందరికీ స్పూర్తిగా నిలుపుతామన్నారు. పేదల ఇళ్లను కబ్జా చేసే వారిపై, భూకబ్జాదారుల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామన్నారు. కరీంనగర్ ఓటర్లపై తనకు నమ్మకం, విశ్వాసం ఉందన్నారు. ఎన్నికల్లో సహకరించిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ, కార్యకర్తలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కరీంనగర్‌లో ఓడిపోతామనే అక్రోశంతో అధికార పార్టీ నేతలు వ్యవహరించారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మెజారిటీ సీట్లు సాధిస్తామన్నారు. ఫలితాలు వెలువడ్డాక ఎమ్మెల్యేల అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకుని జాతీయ నాయకత్వం నిర్ణయం తీసుకుంటుందన్నారు. మేనిఫెస్టో హామీల అమలు చేస్తామని, భూకబ్జాలపై బీజేపీ ఇచ్చినమాటకు కట్టుబడి ఉంటుందన్నారు. పేదల ఇళ్లను కబ్జా చేసే వారిపై, దౌర్జనం చేసే వారిపై తప్పకుండా చర్యలు ఉంటాయన్నారు. కరీంనగర్‌లో ప్రశాంతమైన వాతావరణాన్ని నెలకొల్పి స్ఫూర్తిదాయకమైన వాతావరణాన్ని కల్పిస్తామన్నారు.

# తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం



(మొదటి పేజీ తరువాయి) ఇస్తున్నారు. పోలింగ్ పూర్తి కాకముందే ఎలా ఎగ్జిట్ పోల్స్ ఇస్తారు. లక్షలాది మంది మనసులో కేసీఆర్ ఉన్నాడు. కర్ణాటక నుండి డబ్బులు పంచినం, గెలుస్తున్నం అని కాంగ్రెస్ పార్టీ అనుకుంటుంది. సైలెంట్ ఓట్లు కేసీఆర్‌కు పడ్డాయి... బీఆర్ఎస్‌కు 70 నుండి 75 సీట్లు వస్తాయి. మాస్ ఓటర్.. క్లాస్ ఓటర్ వేరు. క్లాస్ ఓటర్ బీఆర్ఎస్ వైపు ఉన్నారని పోచారం శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. కెసిఆర్‌కు ప్రజల్లో ఆదరణ ఉందని, ఆయన చేసిన పనులే గెలుపునకు దోహదం చేస్తున్నాయని అన్నారు. గతంలో కరెంట్, నీళ్ళు లేక ఎన్నో బాధలు పడ్డామని, ఇప్పుడా బాధలు లేవని, ఇవన్నీ ప్రజల ముందున్న పనులని అన్నారు. 2004లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇస్తే మనం ఇంకా చాలా బాగా ఉండే వాళ్ళమని అన్నారు. తెలంగాణ రాకముందు మంచి నీళ్ళ కోసం బాధ పడ్డామని, ఇప్పుడు మిషన్ భగీరథతో ఆ సమస్య లేకుండా నీళ్ళ సరఫరా చేస్తున్నామని చెప్పారు. మంచీ.. చెడును చూసి.. ఆలోచించి ఓటేసారని నమ్ముతున్నామని అవే సానుకూల ఫలితాలకు దోహదం చేస్తాయని అన్నారు. మూడు రాష్ట్రాల సంగమ ప్రాంతమిదని, మహారాష్ట్రలో పెద్ద మొత్తంలో ఆదాయం ఉన్నప్పటికీ సంక్షేమం లేదని, కర్ణాటకలో సరిగా కరెంట్ ఇవ్వడంలేదని స్పీకర్ ఆరోపించారు. కర్ణాటకలో కేవలం 5 గంటల కరెంట్‌కే గొప్ప అంటున్నారని, తెలంగాణలో 24 గంటల కరెంట్ ఇస్తున్నామని చెప్పారు. రైతు బంధు దుబారా అంటున్న వారు నిజాలు తెలుసుకోవాలన్నారు. కాంగ్రెస్ నేతలు ఈసీకి ఫిర్యాదు చేయడంతో రైతు బంధు ఆపామని, ఎన్నికలు అవ్వగానే అకౌంట్లలో వేస్తామని కేసీఆర్ అన్నారు. దళిత బంధు పథకంను భారత దేశంలో బీఆర్ఎస్ పార్టీ తీసుకొచ్చిందని, దఫాలుగా అందరికీ అందిస్తామని స్పష్టం చేశారు. తెలంగాణ తలసరి ఆదాయం 3 లక్షల 18 వేలతో దేశంలో అభివృద్ధిలో ముందున్నామన్నారు. తెలంగాణ తలసరి విద్యుత్ వినియోగం 22 వందల యూనిట్లతో దేశంలోనే నెంబర్ వన్‌లో ఉన్నామని వ్యాఖ్యానించారు. ఇవన్నీ సానుకూల అంశాలని, వీటి ఆధారంగానే ఓటు వేశారని, అందుకే గెలుపు బిఆర్ఎస్ పక్షం కాబోతున్నదని స్పీకర్ అన్నారు.

# కాంగ్రెస్ శ్రేణుల్లో ఫుల్ జోష్

(మొదటి పేజీ తరువాయి) అభ్యర్థులను ట్రాప్ చేసేందుకు సీఎం కేసీఆర్ ప్రయత్నిస్తున్నారు. మా పార్టీ అభ్యర్థులే ఈ విషయాన్ని స్వయంగా వెల్లడించారు. అయితే, గెలిచిన వారిని క్యాంపులకు తరలించే అవసరం రాదని డీకే తెలిపారు. మరోవైపు ఆదివారం తెలంగాణ ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్టానం అప్రమత్తమైంది. ఎగ్జిట్ పోల్స్ అంచనాలు హస్తం వైపే మొగ్గు చూపిన నేపథ్యంలో తాజా పరిస్థితులపై అలర్ట్ అయ్యింది. గెలిచిన తమ ఎమ్మెల్యేలు చేజారిపోకుండా చర్యలు చేపట్టింది. కొన్ని సంస్థలు హంగ్ వస్తుందని అంచనా వేయగా, ఫలితం అలా వచ్చినా ఏం చేయాలనే దానిపై దృష్టి సారించింది. ఈ క్రమంలో కాంగ్రెస్ లో ట్రబుల్ షూటర్ గా పేరొందిన కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ను రంగంలోకి దించింది. తెలంగాణ ఎన్నికల ఫలితాల పర్యవేక్షణ బాధ్యతలను ఆయనకు అప్పగించింది. దీంతో శనివారం సాయంత్రం డీకే హైదరాబాద్ రానున్నారు. 2 రోజుల పాటు ఆయన ఇక్కడే ఉండనున్నట్లు తెలుస్తోంది. గెలిచిన ఎమ్మెల్యేలను ఎక్కడికి తరలించబోమని, ఆ అవసరం రాదని ఇప్పటికే డీకే స్పష్టం చేశారు. గెలుపు అవకాశాలున్న నేతలకు ఆయన ఫోన్ చేసినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యేలు ప్రలోభాలకు గురి కాకుండా చూసుకునే బాధ్యతను డీకే తీసుకున్నట్లు సమాచారం. డీకే శివకుమార్.. కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి, అక్కడ రాజకీయ సంక్షోభాన్ని పరిష్కరించేలా కీలక పాత్ర పోషించారు. ఎన్నికల్లో నెగ్గిన అభ్యర్థులు చేజారిపోకుండా అందరినీ ఏకతాటిపై ఉంచడంలో ఎక్స్ పర్ట్ అయిన ఈయన పాలిటిక్స్ లో ట్రబుల్ షూటర్ గా పేరొందారు. ఇప్పుడు తెలంగాణ ఎన్నికల ఫలితాల వేళ ఆయన సేవలను మరోసారి కాంగ్రెస్ అధిష్టానం వినియోగించుకుంటోంది. తాము గెలిచామనే ప్రకటన వచ్చేంత వరకూ, కొత్త ప్రభుత్వం కొలువుదీరేంత వరకూ పూర్తి బాధ్యతలను డీకే పర్యవేక్షించనున్నారు. తెలంగాణ ఎన్నికల ఫలితాల రోజున టీకాంగ్రెస్ బిగ్ ప్లాన్ అమలు చేయనున్నట్లు తెలుస్తోంది. ప్రతి నియోజకవర్గంలో ఏఐసీసీ ఓ పరిశీలకుడిని నియమించనుంది. సదరు అభ్యర్థి విజయం సాధించాక వారితో డీకే ఓ సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ సంపూర్ణ మెజార్టీ వస్తే ఇబ్బందే లేదు. లేకుంటే అమలు చేయాల్సిన వ్యూహాలపై పార్టీ సీనియర్ నేతలు, గెలుపొందిన అభ్యర్థులతో చర్చించనున్నట్లు సమాచారం. అయితే, గెలుపుపై ఎవరికి వారే ధీమాగా ఉన్నారు. ఎగ్జిట్ పోల్స్ ను పట్టించుకోవాల్సిన అవసరం లేదని బీఆర్ఎస్ చెబుతుండగా, ప్రజలు మార్పు కోరుకుంటున్నారని ఈ అంచనాలతో నిజమైందని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. 3న ఈ ఉత్కంఠకు తెరపడనుంది.

# శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం



**తిరుమల, డిసెంబర్ 2 (సమ సమాజం):** తిరుమలలో శ్రీ వేంకటేశ్వరస్వామి సర్వదర్శనానికి 8 గంటల సమయం పడుతుందని టీటీడీ అధికారులు వెల్లడించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తిరుమలలోని కంపార్ట్‌మెంట్లలో వేచియున్నారు. నిన్న స్వామివారిని 56,950 మంది భక్తులు దర్శించుకోగా 20,463 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 3.75 కోట్లు వచ్చిందని వివరించారు. తిరుపతిలోని శ్రీ కపిలేశ్వరస్వామి ఆలయంలో రుద్రహోమంశుక్రవారం నుంచి ప్రారంభమైంది. నెల రోజుల పాటు జరుగుతున్న హోమ మహోత్సవాల్లో భాగంగా 11వ తేదీ వరకు హోమం నిర్వహిస్తామని అర్చకులు పేర్కొన్నారు. ఇందులో భాగంగా యాగశాలలో ఉదయం పూజ, రుద్రజపం, హోమం, లఘు పూర్ణాహుతి, నివేదన, హారతి తదితర కార్యక్రమాలను నిర్వహించారు.

# జగన్‌ను ఇంటికి పంపించాల్సిందే

## విశాఖ పార్లమెంట్ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



**విశాఖపట్టణం,డిసెంబర్2 (సమ సమాజం):** పాలకులను ఎంచుకునేటప్పుడు వారి మనస్తత్వం చూడాలని టీడీపీ విశాఖ పార్లమెంట్ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కోరారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ గత నాలుగున్నర సంవత్సరాల పాలనతో సీఎం జగన్ మనస్తత్వం ప్రజలు చూస్తున్నారు. రాష్ట్ర ప్రజలు సైకిల్ రావాలి సైకో పోవాలని అంటున్నారు. జగన్‌కు అత్యంత సన్నిహితుడు సత్తార్ వేంకటేశ్వర రెడ్డి అమెరికలో మానవ అక్రమ రవాణా చేస్తూ దొరికారు. జగన్ వ్యవస్థలను మేనేజ్ చేస్తూ నేరస్తులను ప్రోత్సహిస్తున్నారు. జగన్ రాజకీయాలు నుంచి తప్పుకుంటే మంచిది.. లేదంటే ప్రజలే ఇంటికి పంపిస్తారు. ఆదివారం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి చంద్రబాబు విశాఖకు వస్తున్నారు. యువగళం పాదయాత్ర ఈనెల 6 తేదీకి అనకాపల్లి జిల్లా పాయకరావుపేటకు చేరుకుంటుంది. పాయకరావుపేట నుంచి ఈనెల 7వ తేదీన యువగళం పాదయాత్ర ప్రారంభం అవుతుంది. ఈనెల 17వ తేదీన భీమిలి నియోజకవర్గంలో యువగళం పాదయాత్ర ముగుస్తుంది. యువగళం ముగింపు సందర్భంగా భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నాం. బహిరంగ సభలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ పాల్గొంటారని తెలిపారు.

# ఛత్తీస్‌గఢ్‌లో రెచ్చిపోయిన మావోయిస్టులు

## పోలీసులే లక్ష్యంగా మందుపాతర పేల్చివేత

**ఛత్తీస్‌గఢ్, డిసెంబర్ 2 (సమ సమాజం):** ఛత్తీస్‌గఢ్‌లో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలకు ముందురోజు మావోయిస్టులు రెచ్చిపోయారు. పోలీసులే లక్ష్యంగా మందుపాతర పేల్చారు. బర్సూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మావోయిస్టులు శనివారం మధ్యాహ్నం ఐఈడీ బ్లాస్ట్ చేశారు. ఈ ఘటనలో ఇద్దరు సీఆర్పీఎఫ్ జవాన్‌లు తీవ్రంగా గాయపడ్డారు. పలువురికి గాయాలు కావడంతో వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నట్లు దంతెవాడ పోలీసులు వెల్లడించారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడేందుకు ఒకరోజు ముందు ఈ ఘటన జరగడంతో అందరూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా నవంబరులో తొలి దశ ఎన్నికల పోలింగ్ సమయంలో ఛత్తీస్‌గఢ్ సుక్మా జిల్లాలోని తొండమార్క ప్రాంతంలో మావోయిస్టులు ఇదే తరహా ఘటనకు పాల్పడ్డారు. ఎఇఆ పేలుడులో అఖీఖఈ కోబ్రా బెటాలియన్‌కు చెందిన ఒక జవాన్ గాయపడ్డారు. ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల తొలి విడతలో కుంట అసెంబ్లీ నియోజకవర్గానికి నవంబర్ 7న పోలింగ్ జరిగింది. ఎన్నికల విధుల కోసం నియమించిన సీఆర్పీఎఫ్ జవాన్‌లను లక్ష్యం చేసుకుని ఆనాడు మావోయిస్టులు మందుపాతర పేల్చారని సుక్మా జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్ వెల్లడించారు.

# ఐడిబిఐ బ్యాంక్ రుణ మోసలాపై ఇడి దర్యాప్తు

**రాజమహేంద్రవరం, డిసెంబర్ 2 (సమ సమాజం):** రాజమహేంద్రవరం ఐడీబీఐ బ్యాంకులో రుణాల మోసం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఈడీ దర్యాప్తు కొనసాగుతోంది. రైతుల పేరుతో రుణాలు, ఉద్యోగం పేరుతో అమాయకుల నుంచి ఆధార్ కార్డులు, బ్యాంకు ఖాతాల వివరాలు సేకరించిన నిందితులు.. ఐడీబీఐ బ్యాంకులో కిసాన్ క్రెడిట్ కార్డులపై భారీ మొత్తంలో రుణాలు తీసుకున్నారు. దాదాపు రూ.311.50 కోట్లను నిందితులు వారి సొంత ఖాతాల్లోకి మళ్లించినట్లు ఈడీ దర్యాప్తులో తేలింది. ఆ రుణాలతో సొంత వ్యాపారాలు, ఆస్తులు కొనుగోలు చేసినట్లు ఈడీ అధికారులు గుర్తించారు. ఈ ఏడాది నవంబర్




29న ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని ఆరు ప్రాంతాల్లో ఈడీ అధికారులు తనిఖీలు చేశారు. నిందితులకు చెందిన ఇళ్లు, కార్యాలయాల్లో సోదాలు చేశారు. ల్యాప్‌టాప్‌లు, హార్డ్‌డిస్క్‌లు, కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులకు చెందిన స్థిర, చరాస్తులు సీజ్ చేశారు.

# మొక్కుబడిగా జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం !

ఢిల్లీ వాతావరణ కాలుష్యంపై పాలకుల్లో చిత్తశుద్ధి లోపించింది. కఠిన చర్యలకు ఉపక్రమించడం లేదు. గాలి కాలుష్యం తీవ్రంగా ఉన్నా కారణాలను గుర్తించి నివారణ చర్యలను పట్టించుకోవడం లేదు. ఇంతకన్నా దారుణం మరోటి కాదు. సుప్రం మొట్టికాయలు వేస్తున్నా పట్టింపు లేకుండా పోయింది. పాలకుల నిర్లక్ష్యానికి ఇంతకన్నా నిదర్శనం లేదు. మనది వ్యవసాయిక దేశం..వ్యవసాయమే మన ప్రధాన వనరు. మనకున్న భూమి, నీటి వసతులు ఎంతో విలువైనవి, సారవంతమైన నేలలు, సహజ జలవనరులు మనసొంతం. భారతదేశం అనాదినుంచి వ్యవసా యన్ని ఆధారంగా చేసుకుని ముందుకు సాగుతోంది. వ్యయసాయాన్ని నమ్ముకున్న మనం.. వ్యవసాయాధారిత రంగాలనే ఎంచుకోవాలి. మానవులను కబళించే..ఆరోగ్యాన్ని హరించే పరిశ్రమల జోలిక వెళ్లకుండా ప్రజలు చైతన్యం కావాలి. పరిశ్రమలను కొనితెచ్చుకుని అనారోగ్యం తో జీవించడం అవసరమా అని ఆలోచించాలి. విషతుల్య పరిశ్రమలకు వ్యతిరేకంగా పోరాడాలి.అవసరమైతే వాటిని మూసివేయించాలి. కేవలం వ్యవసాయంతో పాటు,అనుబంధ రంగాలకు మాత్రమే ప్రోత్సాహం ఇచ్చుకునేలా చూడాలి. లేకుంటే మన వనరులు కలుషితం కాగలవు. ఇప్పటికే మన నదులు కలుషితం అవుతున్నాయి. దేశంలో కాలుష్యం పెరగకుండా, కాలుష్యం కాకుండా చర్యలు తీసుకుంటే తప్ప మనుగడ సాధ్యం కాదు. అయితే మధ్యలో వచ్చిన పాలకులు కక్కుర్తిపడిన ఖర్మానికి ప్రజలు కష్టాలు, నష్టాలు అనుభవించాల్సి వస్తోంది. దేశ జనాభా పెరుగుతున్నా మనకు సరైన పౌష్టికాహారం నేటికీ అదండం లేదు. ఈ క్రమంలో మనమంతా చైతన్య వంతులం అయ్యి మన సహజ వనరులు కలుషితం కాకుండా కాపాడు కోవాల్సి ఉంది. కొండలుగుట్టలను కాపాడుకోవాలి. అడవుల ను రక్షించుకోవాలి. అడవులను, కొండలను నరకడం కూడా పర్యావరణ విధ్వంసం కిందకే వస్తుంది. కాకినాడ తీరంలో మడ అడవులను నరకడంతో ఎన్నో దుష్ఫలితాలు ఎదుర్కొంటున్నాం. మట్టి కలుషితం అయినా, నీరు కలిషితం అయినా మన జీవన మనుగడ ప్రశ్నార్థకం కాగలదు. అయితే ప్రభుత్వాలు ఇబ్బడిముబ్బడి గా కాలుష్యం వెదజల్లే పరిశ్రమలకు అనుమ తులు ఇవ్వడం వల్ల మన నీను, భూమి కలుషితం అవుతోంది. పర్యావరణ కాలుష్యం ఎక్కువై ప్రపంచ మానవాళి పలు అనారోగ్య సమస్యల వలయంలో చిక్కుకోవటమే కాకుండా మార్కెట్లో మానవ వనరుల కొరతకు దారి తీస్తుంది. పారిశ్రామిక వ్యర్థాలను ఇబ్బడి ముబ్బడిగా పడేయడం వల్ల సిరులు పండే నేల,జీవాధారమైన నీరు కాలుష్యమౌతుంది. వాహనాలు, పరిశ్రమలు వదిలే పొగగాలి కాలుష్యాన్ని తద్వారా ఉత్పన్నమయ్యే వేడి సమీప ప్రాంతాల జలాశయాల ఉష్ణోగ్రతను పెంచడం ద్వారా ఉష్ణ కాలుష్యాన్నీ పెంచుతోంది. ఈ విధంగా మనం చేస్తున్న అకృత్యాల వల్ల కార్బన్ ఉద్గారం ఎక్కువ కావడం తో వాయు కాలుష్యం ఏర్పడి వాతావరణంలో మార్పులు జరుగుతున్నాయి. వాయు కాలుష్యం వల్ల శ్వాస కోశ వ్యాధులు,వివిధ రకాల మెదడు, గుండె సమస్యలు పెరుగుతున్నాయి. వాయు కాలుష్యం పెరిగి తీవ్రమైన ఊపిరితిత్తుల వ్యాధులు, ఉబ్బసం, మెదడులో రక్తం గడ్డ కట్టడం, కంటిచూపు మందగించడం లాంటిరుగ్మతలు ఎక్కువ అవుతున్నా యని అనేక ఆరోగ్య సర్వేలు వెల్లడించాయి. నేడు మనం నిత్యం వాడే పాలు పండ్లు కూరగాయలు కలుషితమౌతున్నాయి. అలాగే పండించే పంటలు కాష్యంబారిన పడుతున్నాయి. ఈ పదార్థాలు తినడం వల్ల కూడా విపరీతమైన ఆరోగ్య సమస్యలు కొనితెచ్చుకుంటున్నాం. కాలుష్యం ఫలితంగా ప్రపంచంలో మానవజాతి నయం చేయలేని భయంకర రోగాలబారిన పడి వైద్య, ఆరోగ్య రంగానికి సవాల్‌గా పరిణమిం చడం చూస్తున్నాం. అతి పారిశ్రామికీకరణ అన్నది మానవాళిని దెబ్బతీస్తుందని గుర్తించాలి. పచ్చని పంట పొలాలు విషతుల్యం అవుతాయి. ఇటీవల విశాఖలో జరిగిన

గ్యాస్ లీకేజ్ ఘటన తక్కువదేమీ కాదు. ఇలాంటి పరిశ్రమలు అవసరమా అన్నది ఆలోచన చేయాలి. మనకున్న భూమిని, ప్రకృతిని కాపాడుకునేందుకు గట్టి సంకల్పం కావాలి. దీర్ఘకాలంలో పర్యావరణానికి చేటు కలిగిస్తున్న మానవ తప్పిదాలు ఊహించని ఉత్పాతాలకు కారణం కావడం మిక్కిలి ఆందోళనకరం. పర్యావరణ, సంస్కృతి, జీవ వైవిధ్యాల పరంగా ప్రాశస్త్యం కలిగిన పశ్చిమ కనుమలు రానురాను ప్రమాద భరితంగా తయారవడానికి దోపిడీతో కూడిన మానవ తప్పిదాలే కారణమని పర్యావరణవేత్తలు నెత్తీనోరూ మొత్తుకుంటున్నారు. గనుల,క్వారీల తవ్వకాలు,అడవుల విధ్వంసం, పట్టణీక రణ, అటవీ భూములను అటవేతర పనులకు మార్పు చేయడం, నదులు, నదీ ప్రవాహ ప్రాంతాలకు అడ్డంగా పక్కా నిర్మాణాల వంటివి పశ్చిమ కనుమలను విధ్వంసం చేస్తున్నాయి. కేరళ, తమిళనాడు, గోవా, కర్నాటక, మహారాష్ట్ర, గుజరాత్ పశ్చిమ కనుమల్లో భాగం. గతేడాది నాటి కేరళ మహోగ్ర వరదలతో సహా ప్రస్తుత జలవిపత్తుల వరకు అన్నీ పడమటి కనుమల్లోనే సంభవిస్తుండటాన్ని బట్టి చూస్తే పర్యావరణవేత్తల ఆందోళనలు వాస్తవిక రూపం దాల్చుతున్నాయని భావించాల్సి ఉంటుంది. 2013లో ఉత్తరాఖండ్‌ను అకస్మిక వరదలు ముంచెత్తి నప్పుడు నదులపై ఇబ్బడిముబ్బడిగా నెలకొల్పిన జల విద్యుత్ ప్రాజెక్టులు నదుల ప్రవాహాన్ని ఆటంక పర్చి చుట్టుపక్కనున్న ప్రాంతాలను ముంచెత్తాయని కనుగొన్నారు. కానీ ఎలాంటి చర్యలూ చేపట్టలేదు. మళ్లీ ఎప్పుడైనా వరదలొచ్చినప్పుడు మాత్రమే అలాంటి అక్రమాలు చర్చకొస్తాయి. ప్రభుత్వాలకు ఉద్దేశపూర్వక నిర్లక్ష్యం అబ్బినందున ప్రజలకు కష్టనష్టాలు తప్పట్లేదు. మొత్తంగా వరదలకు దేశంలోని దక్షిణ, పశ్చిమ ప్రాంతాలు అతలాకుతలం అవుతున్నాయి. భారీ వర్షాలు, వరదల ఉధృతికి కేరళ, కర్నాటక, మహారాష్ట్ర, గుజరాత్,బీహార్‌లు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. అత్యధిక వర్షపాతం నమోదయినా నీటి సంరక్షణపై పాలకుల్లో చిత్తశుద్ధి లోపించడంతో పాటు, అమలు చేయాలన్న లక్ష్యం కానరావడం లేదు.

# ఇసుక అక్రమాలపై ఎపి హైకోర్టులో పిల్




**అమరావతి, డిసెంబర్ 2 (సమ సమాజం):** రాష్ట్రంలో ఇసుక అక్రమాలు, కాంట్రాక్ట్ ముగిసిన తవ్వకాలపై హైకోర్ట్‌లో పిల్ దాఖలైంది. వేల కోట్లు రూపాయలు దుర్వినియోగంపై ఆధారాలుతో సహా పిటిషనర్ పిల్‌లో చేర్చారు. దండ నాగేంద్ర అనే వ్యక్తి తరపున హైకోర్ట్ న్యాయవాది వీవీ లక్ష్మీనారాయణ పిటీషన్ వేశారు. ఈ యేడాది మే 2న కాంట్రాక్ట్ ముగిసినప్పటికీ కొనసాగించడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సబ్ కాంట్రాక్టర్ టర్న్ కీ సంస్థ పేరిట త్రవ్వకాలు చేశారంటూ బిల్లులతో సహా పిటీషన్‌లో చేర్చారు. అక్రమ తవ్వకాల వలన నదీ ప్రవాహ దిశ మారుతుందని ఆగ్రహం వ్యక్తం చేసిన ఇన్లాండ్ వాటర్ వేస్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నివేదికను కూడా న్యాయవాది లక్ష్మీనారాయణ పిల్‌లో పొందుపరిచ్చారు. ఎన్జీటీ తవ్వ కాలు ఆపివేయాలని కోరినా వినిపించుకోని ప్రభుత్వ తీరును న్యాయవాది వివరించారు. రాష్ట్రంలో నేటికీ జరుగుతున్న అక్రమ తవ్వకాలను వీడియో క్లిప్పింగ్‌లు, ఫోటోలతో సహా పిటీషన్‌లో మెన్షన్ చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న అక్రమ తవ్వకాల వెనుక ప్రభుత్వ పెద్దలు హస్తం ఉందని పిటీషన్‌లో పేర్కొన్నారు. ఈ పిల్‌పై హైకోర్టులో వచ్చే వారం విచారణకు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# రాష్ట్రానికి సేవచేసే భాగ్యం కలగాలి

## దుర్గమ్మను ఇదే కోరుకున్నట్లు బాబు వెల్లడి

10నుంచి చంద్రబాబు జిల్లాల యాత్రలకు షెడ్యూల్



**విజయవాడ, డిసెంబర్ 2 (సమ సమాజం):** తెలుగు ప్రజలకు మరోసారి సేవ చేసే, రాష్ట్రానికి పూర్వ వైభవం తెచ్చే శక్తిని ప్రసాదించాలని కనకదుర్గమ్మను వేడుకున్నట్లు టీడీపీ అధినేత చంద్రబాబు తెలిపారు. శనివారం ఆయన సతీసమేతంగా ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను దర్శించుకున్నారు. తొలుత వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. అనంతరం వేద పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండితుల వేద ఆశీర్వచనం అనంతరం, అమ్మవారి ప్రసాదం, చిత్రపటం అందించారు. బెజవాడ దుర్గమ్మ శక్తి స్వరూపిణి అని, సమాజాన్ని రక్షించి దుష్టుల్ని శిక్షించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు చెప్పారు. మానవ సంకల్పానికి దైవ సహాయం ఎంతో అవసరమనే రాష్ట్రంలో ప్రముఖ పుణ్యక్షేత్రాలు దర్శిస్తున్నట్లు తెలిపారు. విజయవాడకు వచ్చిన చంద్రబాబుకు ఎంపీ కేశినేని నాని, టీడీపీ నేతలు కేశినేని చిన్ని, జనసేన నేత పోతిన మహేష్, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, అశోక్ బాబు, దేవినేని ఉమా, కొల్లు రవీంద్ర, యార్లగడ్డ వెంకట్రావు, మాగంటి బాబు, బుద్దా వెంకన్న, ఇతర నేతలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గుంటూరు ఉమెన్స్ కాలేజీకి చెందిన విద్యార్థినులను చంద్రబాబు పలకరించారు. దుర్గమ్మ దర్శనం అనంతరం ఉండవల్లిలోని నివాసానికి వెళ్తుండగా, కొండవీటి వాగు లిఫ్ట్ వద్ద విద్యార్థినులు కనిపించారు. దీంతో కారు ఆపి వారితో ముచ్చటించారు. తాము బీఈడీ విద్యార్థులమని, స్టడీ టూర్ కోసం గుంటూరు నుంచి వచ్చామని విద్యార్థినులు తెలిపారు. దేవాలయాల సందర్శన అనంతరం చంద్రబాబు పూర్తి స్థాయి పార్టీ కార్యక్రమాల్లో పాల్గొననున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఇందులో భాగంగా ఈ నెల 10 నుంచి ఆయన జిల్లాల పర్యటనకు సిద్ధమయ్యారు. పంచాయతీ రాజ్ వ్యవస్థను జగన్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని, సర్పంచ్ లను ఉత్సవ విగ్రహాలుగా మార్చేసిందని టీడీపీ ఆరోపిస్తోంది. ఈ క్రమంలో రాష్ట్రంలోని 4 ప్రాంతాల్లో ఏపీ పంచాయతీ రాజ్ చాంబర్, ఏపీ సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే సమావేశాల్లో చంద్రబాబు పాల్గొంటారు. ఈ నెల 10న శ్రీకాకుళం, 11న కాకినాడ, 14న నరసరావుపేట, 15న కడప జిల్లాల్లో జరిగే సమావేశాల్లో ఆయన పాల్గొననున్నారు. ఈ సమావేశాలకు పార్టీలకు అతీతంగా సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలను ఆహ్వానించనున్నారు. ఒక్కో సమావేశానికి సుమారు 5 నుంచి 6 వేల మంది వరకూ హాజరవుతారని అంచనా వేస్తున్నారు. కాగా, విజయవాడ ఎయిర్ పోర్టులో శుక్రవారం ఆసక్తికర సన్నివేశం జరిగింది. తిరుమల శ్రీవారి దర్శనం అనంతరం టీడీపీ అధినేత చంద్రబాబు విజయవాడకు ఇండిగో విమానంలో చేరుకున్నారు. అయితే, ఇదే విమానంలో మంత్రి రోజా కూడా వచ్చారు. అయితే, చంద్రబాబు రాకతో విమానాశ్రయానికి పార్టీ శ్రేణులు, అభిమానులు భారీగా చేరుకున్నారు. దీంతో సందడి నెలకొంది. ఈ క్రమంలో ప్రత్యేక సెరెమోనియల్ లాంజ్ ద్వారా మంత్రి రోజాను పోలీసులు బయటకు పంపారు. గతంలో విశాఖ ఎయిర్ పోర్టులో జనసైనికులు ఉన్న సమయంలో మంత్రి రోజాను పంపడంతో ఉద్రిక్తత తలెత్తింది. మళ్లీ అలాంటి ఘటనలు జరగకుండా ప్రత్యేక లాంజ్ ద్వారా మంత్రిని పంపించినట్లు పోలీసులు తెలిపారు.

# నేడు ఎన్నికల ఫలితాలు

## పిసిసి చీఫ్ రేవంత్ ఇంటివద్ద భారీగా భద్రత



**హైదరాబాద్, డిసెంబర్ 2 (సమ సమాజం):** టీపీసీసీ అధినేత, మల్కాజ్‌గిరి ఎంపీ రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లోని ఇంటి వద్ద భారీ భద్రత ఏర్పాటు చేశారు. మెజార్టీ ఎగ్జిట్ పోల్స్‌లో కాంగ్రెస్ పార్టీదే అధికారం అని తెలవడంతో రేవంత్‌రెడ్డి ఇంటి వద్ద పోలీసులు అధిక సంఖ్యలో మోహరించారు. గతంలో కంటే ఎక్కువగా పోలీసులను మోహరించారు. పోలింగ్ అంచనాలు కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా వస్తుండడంతో నాయకులు, కార్యకర్తలు రేవంత్‌రెడ్డి ఇంటికి భారీగా తరలివస్తున్నారు. కాంగ్రెస్ తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిస్తే సీఎం అభ్యర్థి రేవంత్‌రెడ్డి అనే ప్రచారం జోరుగా జరుగుతోంది. దీంతో ఆయన నివాసానికి పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలి వచ్చే అవకాశం ఉందని తెలియడంతో ఇంటెలిజెన్స్ వర్గాల సమాచారం ఆధారంగా భద్రత పెంచినట్టు తెలుస్తోంది. మరోవైపు తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం శ్రమించిన, సహకరించిన ప్రతి ఒక్కరికి పేరు పేరునా ధన్యవాదాలు తెలుపుతున్నాంటూ రేవంత్‌రెడ్డి ఎక్స్‌లో ట్వీట్ చేశారు. గడచిన పదేళ్లుగా అడుగడుగునా అణచివేతలు, దాడులు, కేసులకు భయపడకుండా కాంగ్రెస్ పార్టీ చేసిన పోరాటంలో మీరంతా ప్రజల పక్షాన నిటారుగా, నికార్సుగా నిలబడ్డారని కొనియాడారు. మీ కష్టం, శ్రమ వృథా కాలేదని తెలిపారు. తెలంగాణలో ప్రజాస్వామ్య పునరుద్ధరణలో మీ అందరి పాత్ర మరువలేనిదని.. ప్రతి ఒక్కరికి అభినందనలు తెలియజేస్తున్నానని పేర్కొన్నారు.

# ఎపిలో బటన్ పాలనకు చరమగీతం

## బిజెపి ఎంపి లక్ష్మణ్ వెల్లడి

**తిరుపతి, డిసెంబర్ 2 (సమ సమాజం):** తెలంగాణలో కుటుంబ పాలనకు స్వస్తి పలకడం ఖాయమైందని, బీజేపీ ఎంపీ లక్ష్మణ్ అన్నారు. శనివారం నాడు తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ... ఏపీలో రాబోయే ఎన్నికల్లో బటన్ నొక్కే ప్రభుత్వాన్ని ఇంటికి పంపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. తిరుమల వెంకన్న నిధులు పక్కదారి పడుతున్నాయని అన్నారు. భక్తుల విరాళాలు దేవుడి కైంకర్యాలకు వినియోగించాలని ఎంపీ లక్ష్మణ్ తెలిపారు. ప్రాచీన కట్టడాలను కాపాడి భావితరాలకు అందించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. పురాతన కట్టడాలను కూల్చే సమయంలో టీటీడీ భక్తుల మనోభావాలని దృష్టిలో పెట్టుకోవాలని కోరారు. పార్వటి మండపం పునర్ నిర్మాణం సమయంలో టీటీడీ ఆర్కాలజీ డిపార్ట్‌మెంట్‌ని సంప్రదించిందో లేదో భక్తులకు తెలియజేయాలని చెప్పారు. శ్రీవారికి భక్తులు సమర్పించే కానుకలను టీటీడీ ధర్మ ప్రచారం కోసం మాత్రమే వినియోగించాలన్నారు. తిరుపతి అభివృద్ధికి ప్రభుత్వ నిధులనో లేక నగరపాలిక నిధులను వినియోగించాలని ఎంపీ లక్ష్మణ్ కోరారు.

**Edited, Printed, Published & owned by *GOSUKONDA PRUDHVIRAJU***, Published From, Flot n.o. 6 W.P, Sriramanuja nagar colony, Munganoor, Abdullapurmet, Rangareddy- 501511, TELANGANA,
**Printed at *Panidhar PUBLICATIONS.*** Flot n.o. 6 W.P, Sriramanuja nagar colony, Munganoor, Abdullapurmet, Rangareddy- 501511, ***Editor: GOSUKONDA PRUDHVIRAJU***,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in